క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు భాగ్యనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానూరులో డీఎస్‌ఆర్ కాలనీ, దళితవాడ, ఎస్‌బీఐ కాలనీ, రాజ్‌మల్ బిల్డింగ్స్, కానూరు ప్రధాన రహదారి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గోపూజ



గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీ విశాలాక్షి అన్నపూర్ణదేవి సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపూజ నిర్వహించారు. తొలుత స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని 108 కలువ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గోవులకు శాస్త్రోక్తంగా భక్తులచే పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: అధిక పాల దిగుబడి సాధించేందుకు సమీకృత దాణాను రాయితీపై పాడిరైతులకు పంపిణీ చేస్తున్నట్లు అంపాపురం ప్రభుత్వ పశువైద్యశాల అధికారి డాక్టర్ దుర్గాభవాని తెలిపారు. బాపులపాడు మండలంలోని అంపాపురం పశువైద్యశాలలో కోడూరుపాడు, వీరవల్లి, బండారుగూడెం పాడిరైతులకు 50 క్వింటాళ్ల సమీకృత దాణాను శుక్రవారం పంపిణీ చేశారు. 200 కేజీల సమీకృత దాణా ఖరీదు రూ. 3,160 కాగా, ప్రభుత్వ సబ్సిడీపై కేవలం రూ. 1,300లకే పాడిరైతులకు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. పాడిరైతులకు పంపిణీ చేసేందుకు మరో 50 క్వింటాళ్ల దాణా సిద్ధంగా ఉందని చెప్పారు. వెటర్నరీ అసిస్టెంట్లు సామ్రాజ్యం, పార్వతి, పాడి రైతులు కోడెబోయిన బాబి, సూరెడ్డి బెనర్జీ, సుంకర ప్రకాశరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



కంకిపాడు: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. కంకిపాడు పట్టణంలో పచ్చిపాల కనకదుర్గారావు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అమ్మ క్యాంటీన్‌లో శుక్రవారం ఆయన తన సొంత ఖర్చులతో 200 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత రాజును నిర్వాహకులు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి బాధలు తీర్చడంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అమ్మ క్యాంటీన్ నిర్వహణ స్ఫూర్తిదాయకంగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో అమ్మ క్యాంటీన్ నిర్వాహకుడు పచ్చిపాల కనకదుర్గారావు, మాలమహానాడు నాయకుడు సిరివెళ్ల చిట్టిబాబు, మదర్‌థెరిస్సా సేవా సమితి ప్రతినిధి తాడితోటి నరసింహారావు, దళిత సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు పాతూరి చంద్రశేఖర్, దళిత సంఘ నేతలు సరిహద్దు ఆంథోని, మాచర్ల రవి, దాసరి హనుమంతరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ చెంత భక్తి సంగీతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తిరుపతికి చెందిన మన సంస్కృతి కళా సంస్థ కళాకారులు భక్తి సంగీతాన్ని ఆలపించారు. కె.రెడ్డెప్ప పర్యవేక్షణలో నాగమణి, రుక్మిణి, రాజశేఖర్, మోగితేశ్వరి, గీతతో పాటు పలువురు కళాకారులు కీర్తనలను ఆలపించారు. అనంతరం భక్త బృందం సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. డీఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

- రైవస్ కాలువ గట్టు, ప్రధాన రహదారిపై వెలుస్తున్న పాకలు, హోటల్స్
- అక్రమార్కులపై అధికారుల చర్యలు నిల్

రామవరప్పాడు: నిడమానూరులో పలు చోట్ల యథేచ్ఛగా ఆక్రమణలు చోటు చేసుకుంటున్నా.. సంబంధిత అధికారులకు ఏ మాత్రం పట్టడం లేదు. గ్రామంలో ప్రధాన రహదారికి ఇరు వైపులా ఆక్రమణలు జరుగుతున్నా, రైవస్ కాలువ గట్టుపై పాకలు వెలుస్తున్నా ఇటు పంచాయతీ అధికారులు గానీ, అటు ఇరిగేషన్ అధికారులు గానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏలూరు జాతీయ రహదారి నుంచి గ్రామం లోపలికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. జెండా చెట్టు సెంటర్ నుంచి రైవస్ కాలువ వంతెన సమీపం వరకూ ఈ విధంగానే విలువైన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. గతంలో ఈ రహదారి అభివృద్ధిలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి సువిశాల ప్రధాన రోడ్డు మార్గంగా అభివృద్ధి చేశారు. అనంతరం మళ్లీ ఇదే ప్రాంతాల్లో చిన్న చిన్నగా ఆక్రమణలు ప్రారంభమై ప్రస్తుతం ఖాళీ లేకుండా తయారైయ్యాయి. పలువురు పశువుల పాకలు, మరికొందరు నివేశిత పాకలు, హోటల్స్, గడ్డివాములు ఇలా ఖాళీ చోటు కనబడితే చాలు వదలడం లేదు. రానూ రానూ ఆక్రమణలు పెరిగిపోతుండటంతో గ్రామంలోని ప్రధాన రహదారిపై బస్సులు, ఇతర వాహనాలు ఎదురెదురుగా వస్తే దాటుకుని వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఆక్రమణల విషయంపై పంచాయతీ కార్యాలయంలో పలువురు ఫిర్యాదు చేసినా అధికారులు ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



రైవస్ కాలువ గట్టుపై వేసిన పాకలు



ప్రధాన రహదారి పక్కన పశువుల పాకలు

కలెక్టర్ ఆగ్రహించినా చర్యలు శూన్యం

ప్రధాన రహదారి వెంబడి ఆక్రమణలు పెరిగిపోవడం, పశువుల పాకలు, పెండ కుప్పల ఫలితంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామానికి వచ్చిన అప్పటి కలెక్టర్ ఢిల్లీరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల పాకలు ప్రధాన రహదారికి ఆనుకుని ఆక్రమించడంతో పశువుల పేడ, గడ్డివాముల ఫలితంగా పారిశుద్ధ్యం కొరవడటం, పైగా తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండటం గమనించి అప్పటి పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్‌ను హెచ్చరించి నోటీసులు కూడా జారీ చేశారు. ఇటీవల ప్రకాష్‌నాథ్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎన్. నరసింహారావు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా వచ్చిన కార్యదర్శి కూడా ఈ ఆక్రమణలు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించకపోవడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

స్థలాలను ఆక్రమించి ధరలు నిర్ణయించి

నిడమానూరు రైల్వే ట్రాక్స్ సమీపంలోని రైవస్ కాలువ గట్టు రానూ రానూ ఆక్రమణకు గురవుతోంది. ప్రస్తుతం కాల్వగట్టు వెంబడి పదుల సంఖ్యలో ఆక్రమణలు జరిగాయి. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు కాల్వగట్టుపై చెట్లు, పిచ్చి మొక్కలు శుభ్రపరుచుకోవడం రాత్రికి రాత్రి ఆక్రమించుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఈ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించి ధరలు నిర్ణయించి అమ్మేస్తున్నా.. అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. ఇక్కడి ఆక్రమణలపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాల్సిన ఇరిగేషన్ లస్కర్ కూడా ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాల్వగట్టుపై పాకలు పెరిగిపోతుండటంతో రైతులు తమ పొలాలకు రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా పోతుందని వాపోతున్నారు. పంచాయతీ, ఇరిగేషన్, రైల్వే శాఖలు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతంలో కూడా రానూ రానూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆడపిల్లల సంరక్షణకు చర్యలు



పోరంకిలో ప్రసంగిస్తున్న ఎస్ఐ ఉషారాణి

పెనమలూరు: ఆడపిల్లల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. పోరంకి కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఐ ఉషారాణి పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లలు వ్యక్తిగత సంరక్షణపై జాగ్రత్తతతో ఉండాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న ఘటనలపై పూర్తి అవగాహణతో ఉండాలని అన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. స్మార్టు ఫోన్లపై అవగాహన లేకుండా వాడటం వల్ల చిక్కుల్లో పడతారని చెప్పారు. అలాగే సైబర్ నేరాలపై కూడా విద్యార్థులు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లరాదన్నారు. బాలికలు ప్రమాదంలో ఉంటే వెంటనే 112, 1098 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారిని కమ్మేస్తున్న పొగ

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద గన్నవరం-ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తకుప్పలకు గత కొన్ని రోజులుగా పంచాయతీ సిబ్బంది నిప్పుపెడుతున్నారు. దీంతో చెత్తకుప్పల నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ రహదారిని పూర్తిగా కమ్మేస్తోంది. ఎదురెదురుగా వెళ్లే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించని పరిస్థితి నెలకొంది. పొగ వల్ల ఈ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. అంతే కాకుండా దట్టమైన పొగ మధ్య ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి చెత్తకుప్పలకు నిప్పు పెట్టకుండా నివారించాలని స్థానికులు కోరుతున్నారు. చెత్తను ఇక్కడి నుంచి తరలించి ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చెత్తకుప్పలకు నిప్పు పెట్టడంతో కమ్ముకున్న పొగ

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

కంకిపాడు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 23, 24వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి. భావనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శని, ఆదివారాల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అర్హులైన వారు తమ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని, పేర్లు తప్పులు, సవరణలు ఉంటే సరిచేయించుకోవాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళను మోసగించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళపై లైంగిక దాడి చేసి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకిలో ఉంటున్న మహిళ, విజయవాడ గురునానక్‌నగర్‌కు చెందిన ఒడుగు సురేష్‌లు 2018వ సంవత్సరంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక పాప. భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో విడిపోయారు. దీంతో ఆ మహిళ యనమలకుదురులో గత ఏడాది నివాసం ఉండి కుట్టు పనులు చేసేది. ఆమె వద్దకు నాగపూజ అనే మహిళ వచ్చి జాకెట్లు కుట్టించుకునేది. జాకెట్లు కుట్టినందుకు పూజ తన భర్త కొండపల్లి సుందర్ ఫోన్ నుంచి సొమ్ము చెల్లించేది. ఈ క్రమంలో సుందర్ ఆ మహిళకు ఫోన్ చేస్తూ పరిచయం పెంచుకున్నాడు. దీంతో ఆమె యనమలకుదురు నుంచి పోరంకికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటుంది. సుందర్ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమె వద్ద బంగారు ఆభరణాలు, రూ. 4 లక్షలు సొమ్ము తీసుకున్నాడు. ఆమెను గర్భవతిని చేశాడు. అయితే పెళ్లి చేసుకోవడానికి సుందర్ నిరాకరించాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

కంకిపాడు: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటాలని ఎస్‌బీఐ కంకిపాడు బ్రాంచ్ మేనేజర్ ఏవీవీ సూర్య ప్రకాశరావు సూచించారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు నాసా స్పేస్‌సెటిల్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు స్పేస్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పేస్‌లో జరిగే ఆసక్తికరమైన అంశాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ ధీరేంద్ర, ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, డీన్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల పని గంటల పెంపు ఉపసంహరించుకోవాలి

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల

కంకిపాడు: బోధనాభ్యసన ప్రక్రియకు ఏ మాత్రం ఉపయుక్తంగా లేని పని గంటల పెంపు ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం పునాదిపాడు, కంకిపాడు, ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పనివేళల అంశంలో పాత విధానాన్నే అమలు చేయాలని కోరారు. జీఓ 117, సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌లు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. రాజేంద్రప్రసాద్, కె. సాల్మన్ రాజు, పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వరుణ్‌కుమార్

లయకారుడికి లక్ష దీపోత్సవం



పేరంటాలమ్మ ఆలయంలో శివలింగ ఆకారంలో వెలిగించిన దీపాలు

విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని శుక్రవారం లక్ష దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శివలింగం ఆకారంలో దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరస్వామి, పేరంటాలమ్మను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- రామవరప్పాడు

పిట్ట కొంచెం నాట్యం ఘనం



సినీనటి రాగిణి, త్రిపురి బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులతో చిన్నారి హేమశ్రీ

- కూచిపూడి నాట్యంలో ప్రతిభ చాటుతున్న చిన్నారి హేమశ్రీ
- పలు వేదికలపై ప్రదర్శనలతో ప్రశంసలు

గన్నవరం రూరల్: పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్న నానుడిని నిజం చేస్తూ అతిచిన్న వయసులోనే కూచిపూడి నాట్యంలో ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటోంది ఈ చిన్నారి ఢిల్లీ హేమశ్రీ. గన్నవరంకు చెందిన ఢిల్లీ చోలేష్ రమ్య, బుజ్జిబాబు దంపతుల కుమార్తె హేమశ్రీ. పట్టణంలోని శ్రీ ప్రజ్ఞ స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, కూచిపూడి నాట్య గురువు వనజా చంద్రశేఖర్ మార్గదర్శనంలో పలు వేదికలపై ప్రదర్శనలు ఇస్తూ ప్రశంసలు అందుకుంటోంది.



మెమెంటో, సర్టిఫికెట్‌తో హేమశ్రీ

హేమశ్రీ ప్రదర్శనలు

ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన త్రిపురి బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నిర్వహించిన కార్తిక మాస నృత్య మహోత్సవ కార్యక్రమంలో ప్రదర్శన ఇచ్చి సర్టిఫికెట్, మెమెంటోను సాధించింది. విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ హైదరాబాద్ వారు దేశ వ్యాప్తంగా 333 మంది కళాకారులచే నిర్వహించిన నృత్య మహోత్సవంలో ప్రదర్శన ఇచ్చింది. కార్తిక మాసం సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ హైదరాబాద్ వారు ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఈ మహోత్సవం నిర్వహించారు. అకాడమీ ఫౌండర్, ప్రెసిడెంట్ విజయకుమారి కె. హిందోచ, సినీనటి రాగిణి, అకాడమీ నిర్వాహకులు, గురువు వనజా చంద్రశేఖర్ హేమశ్రీని అభినందించారు. నృత్య మహోత్సవంలో ప్రతిభ చాటిన చిన్నారిని శుక్రవారం పలువురు దీవించారు.

మాతా శిశు సేవల్లో ప్రగతి సాధించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య సిబ్బంది మాతా శిశు సేవలు, ఎన్‌సీడీ-సీడీ సర్వే-3లో ప్రగతి సాధించి లక్ష్యాలు చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు, మెనూ నిర్వాహణ వంటి అంశాలను తనిఖీ చేశారు. పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ బిల్లల పంపిణీని అడిగి తెలుసుకున్నారు. వ్యాధుల నియంత్రణపై సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు.

అధికారులతో సమీక్ష

జిల్లా ప్రోగ్రాం అధికారులతో నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో పలు అంశాలపై డాక్టర్ సుహాసిని సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాల ప్రగతి, మాతా శిశు సంరక్షణ సేవలు లక్ష్యాలను చేరుకోవడం, ఈ ఆశా యాప్ నిర్వాహణ వంటి అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీనాయుడు, డాక్టర్ పద్మావతి, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, డాక్టర్ బాలాజీ, గణాంక అధికారి లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఉయ్యూరు: ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం మండవ జయదేవ్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వసతులు, ఏర్పాటు చేయాల్సిన పరికరాలపై సమీక్షించారు. వసతుల కల్పన, సిబ్బంది సమస్యలు, పరికరాల ఏర్పాటుపై సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాలని తీర్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ శేషగిరిరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళి, కమిటీ సభ్యులు వినయ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో మానవత సభ్యులు, ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చదువులో రాణించడంతో పాటుగా క్రమశిక్షణ కలిగినప్పుడే విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోగలరని మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మానవత ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన తరగతులను నిర్వహించారు. భవిష్యత్ లక్ష్యసాధనకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను తొలిమెట్టుగా విద్యార్థులు భావించి, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని మారుబోయిన సూచించారు. పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గత ఏడాది ఆరు నుంచి తొమ్మిదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు మానవత ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ విద్యార్థులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను మానవత సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్, మానవత కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం జిల్లా డైరెక్టర్ డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు, కార్యదర్శి ప్రాబోలు గణేష్, సీనియర్ సభ్యుడు కొట్నాని రామచంద్రరావు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

గన్నవరం: కార్తిక మాసం సందర్భంగా ఈ నెల 24, 25వ తేదీల్లో పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నడపనున్నట్లు గన్నవరం డిపో మేనేజర్ పి. శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు తెల్లవారుజామున మూడు గంటలకు గన్నవరం బస్టాండ్ నుంచి బయలుదేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని ఆలయాలను దర్శించుకుని అదే రోజు రాత్రి డిపోకు చేరుకుంటాయన్నారు. లగ్జరీ బస్సు చార్జీ రూ. 1,150, అల్ట్రా డీలక్స్ బస్సు చార్జీ రూ. 1,080గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర సమాచారం కోసం 8790996090, 7382905633 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గన్నవరం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై శుక్రవారం గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని జక్కులనెక్కలం గ్రామానికి చెందిన ముచింతల ఉమామహేశ్వరరావుకు, దుర్గాభవానికి నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే భర్త, అత్తమామ, ఆడబిడ్డ వేధింపులు తాళలేక ఇంటిలో ఉన్న కలుపు నివారణ మందు తాగి దుర్గాభవాని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చిన్నఆవుటపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.